# -: ముద్దు :-

రచన :

శ్రీ తమ్మిశెట్టి రామారావు.

"ముద్దంటే చేదా? నీకావుద్దేశం లేదా? ఇపుడొద్దన్నా వంటే! వర్రవాడా? రేపు యిమ్మన్నా యిస్తానా వెర్రివాడా!" అన్నడ్యూయెట్ సాంగ్ సిలోన్ స్టేషన్ నుంచి చక్కగా వినవస్తోంది. ఆపాట వింటుంటే చప్పున ఏదో గుర్తుకి వచ్చింది క్రిష్ణకి.

వెంటనే షెల్ఫ్‌లోంచి కాగితాలూ–పెన్నూ తీసుకుని మేడెక్కాడు. చల్లని పిల్ల తెమ్మెరలు వీస్తుంటే, ఆలా పిట్టగోడకి ఆనుకుని కూర్చున్నాడు. ఒకసారి ఆకాశం వంకా, రోడ్డువంకా చూశాడు. మరోసారి దూరంగా కనబడుతున్న కొబ్బరితోట వలక చూసాడు. తనకేమీ థీమ్ దొరకడం లేదు.

ఛీ!...పాడు బుర్ర సమయానికి సరిగ్గా పని చేసి చావదు. వుత్తప్పుడయితే ఎన్నో థాట్స్ కందిరీగల్లా బుర్రలో జుమ్మంటూ తిరుగుతాయి. అయినా తను యీ చేత్తో యిప్పటికి ఎన్ని కథలు రాయలేదని! ఎన్ని కథలు వివిధ పత్రికల్లోరాలేదని! అవిచూసి తన ఫ్రెండ్స్ తన్ను ఎంత పొగిడేయలేదని! కొంత మంది తన్ను మొహమాటపెట్టి తన కథలు వాళ్ళపరం చేసుకున్నారు కూడా.

అయినా వాళ్ళంతా అబ్బాయిలు. మరియిపుడు తన్ను కథ రాయమని కోరింది. ఎవరు?...ఒక అందమైన అమ్మాయి. కాలేజీ బ్యూటీ!...ఎ వండర్‌ఫుల్ డ్రీమ్ గరల్...అటువంటి సుందరాంగి తన కొకకథ కావాలని అడిగిందంటే, తను పూర్వజన్మలో ఎంత పుణ్యం చేసుకుని వుండాలి. అదీ వుత్తి పుణ్యానికే కాదు కూడా, కథరాసిస్తే తనకొక చక్కని స్వీట్ ప్రజంటేషన్ చేయబోతోంది. అందుకే కథ రాయడానికి పూనుకున్నాడు క్రిష్ణ.

క్రిష్ణ బియ్యే ఫైనల్ చదువుతున్నాడు. ఒక ప్రక్క చదువుతునే మరోప్రక్క కథలూ–కవితలూ రాస్తుంటాడు. సాహిత్యం తనకి ఆరోప్రాణం. కాలేజీ ఎస్సేరైటింగ్ పోటీలో ఫస్ట్‌ప్రయిజ్ శ్యామలకి కాదు తనకే రావలసిందంటాడు, శ్యామల పేపర్ చూసి కాదు, ఆమె ఫేస్ చూసి ఫస్ట్‌ప్రయిజ్ యిస్తున్నారు. తప్పకుండా తనకి రావలసిందే కాని తెలుగు లెక్చరర్ తనకి సెకండ్ ప్రయిజ్ అవార్డు చేస్తున్నాడంటాడు.

శ్యామలకూడా బియ్యే ఫైనల్ చదువుతోంది. ఆ యేడు ప్రచురించ బోయే కాలేజీ మేగజైన్ కితనొక కథరాసి యివ్వాలను కొంది కాని రాయలేక పోతోంది. ప్రిన్సిపాల్ సర్క్యులేషన్‌లో యిచ్చిన గడువు దాటిపోతోంది, అందుకే ఆఖరుకి తను క్రిష్ణను కథకోసం ఆశ్రయించక తప్పలేదు. క్రిష్ణ రాయక తప్పలేదు.

"హల్లో! కవీశ్వరా! యీ నిర్మల ప్రశాంత వేళ, నిర్జన ప్రదేశంబున గూర్చుండి, తదేక దీక్షతో తమరు రాయబోవునది ప్రబంధమా! లేక ప్రణయలేకనమా?"

వెనుక నుంచి వినబడిన మాటలువిని తలపిప్పి చూశాడు క్రిష్ణ, వచ్చింది ఎవరోకాదు. తమ కాలేజీ బాయ్స్ యూనియన్ ప్రెసిడెంట్ శేషగిరి.

"ఏమిటి శేషగిరి యిలా వచ్చావు?" అంటూ పలకరించాడు క్రిష్ణ.

"ఏమీలేదు నీతో చిన్నపని వుండివచ్చాను" అంటూ దగ్గరికి వచ్చాడు శేషగిరి.

"ఏమిటో?" అన్నాడు క్రిష్ణ.

"ఇది కథలాగుందే? అయిపోయిందా?" అన్నాడు శేషగిరి, క్రిష్ణరాసిన స్క్రిప్ట్ వంక చూసి.

"లేదు యింకా కొంచెంవుంది!" అన్నాడు క్రిష్ణ.

"నిన్న కాలేజీ మేగజైన్‌కి ఒక కథ యిచ్చినట్టున్నావు. మరి ఇది ఏదైనా పత్రికక్కా?" అన్నాడు శేషగిరి,

"లేదు మేగజైన్ కే!" అన్నాడు క్రిష్ణ.

"అయితే నాకిచ్చెయ్యి! నేను నిన్ను కథఅడగడానికే వచ్చాను. యిది నా పేరున వేయించుకుంటాను" అన్నాడు శేషగిరి:

"అహా! యిది యివ్వను, శ్యామల అడిగింది. అయినా నీకిస్తే నీవేమిస్తావు?...అదే శ్యామలైతే?...

"శ్యామలైతే ఏమిస్తుంది?" వెంటనే అందుకున్నాడు శేషగిరి.

హీరోలా పోజు పెట్టి "ముద్దు" అన్నాడు క్రిష్ణ.

యింపాజిబుల్! నేను నమ్మను. నాదగ్గరన్నమాట శ్యామల దగ్గరన్నావంటే, నీకిచ్చేది కిస్ కాదు... కిక్

సీరియస్ గాపోజు పెట్టి అన్నాడు శేషగిరి.

"నో! నో! శేషగిరి నీవు పొరబడుతున్నావు. రవి సాధించలేని పనిని కవిసాధిస్తాడు. ఏదో ఒక సారి ఆమె చేతిలో నీవు కిక్ తిన్నమాట నిజమే ననుకో. అంత మాత్రం చేత నేనూ కిక్ తింటాననుకున్నావా? నిన్న శ్యామలే నాదగ్గరికివచ్చింది"

"ఓహో! అదాసంగతి నిన్న మీయింటికి వస్తుంటే, ఏమిటా! శ్యామల దారి తప్పివస్తున్నది అనుకున్నాను. ఇంగ్లీషు లెక్చరర్ గారి యిల్లు అవతల వీధిలోగదా! అక్కడ పాఠాలు మానేసి నీదగ్గర నేర్చుకోడానికి వచ్చిందా? అసలు నిన్న మీయింటి దగ్గర ఏం జరిగిందో చెప్పు" జలసీ ఫీలవుతూ అన్నాడు శేషగిరి.

"సారీ! శేషగిరీ! ఆవిషయం అక్కడితో వదిలేయ్! ఇంతకూ నీకొక కథ కావాలంటావు? అంతేనా?" మాట మార్చ బోయాడు క్రిష్ణ.

"అసలు కథ వదిలేసి యింకేదో కథ నాకెందుకు? ముందు శ్యామల కథ చెప్పు లేకపోతే నేను వూరుకోను?

"మరీ అంతనన్ను ప్రెస్ చెయ్యకు శేషగిరీ! అసలే నీవు వేడిమీద వున్నావు. యీ విషయం యింకెవరికైనా చెప్పావంటే, యింకేమైనా వుందా? బెట్టుచేశాడు క్రిష్ణ.

"నో!...నో!... నే నెవరికీ చెప్పను. అసలు జరిగిందేమిటో అంతా చెప్పు ప్లీజ్! నిన్ను బ్రతిమాలుతున్నాను." విలవిలలాడాడు శేషగిరి.

అయితే శేషగిరి నిజంగా శ్యామల్ని ప్రేమిస్తున్నాడన్నమాట మనసులో అనుకుని పైకి—

"అయితే విను కథంతావిని మాత్రం కళ్ళుపోగూడదు నిగ్రహించుకోవాలి?" అంటూ కథను మొదలు పెట్టాడు క్రిష్ణ.

♦ ♦ ♦

క్రిష్ణ నిన్నరూంలో కూర్చుని చదువు కుంటున్నాడు. అంతలో చెల్లెలువచ్చి నీకోసం ఎవరో అమ్మాయి వచ్చిందని చెప్పింది. రమ్మని చెప్పమన్నాడు.

ఐదునిముషాల్లో శ్యామల దగ్గరకివచ్చింది. ఆమెరాక తనకు ఆశ్చర్యాన్ని కలిగించింది. తన్నుతనే మర్చిపోయాడు.

కూర్చోమని సౌంజ్ఞ చేశాడు. మరబొమ్మలా ఒదిగి సోఫాలో కూర్చుంది శ్యామల, యిద్దరి మధ్య కొన్ని క్షణాలు మౌనం.

"యిలా వచ్చారు ఏమిటి విశేషం?" అన్నాడు క్రిష్ణ.

"విశేషమేమీ లేదండి? సశేషమే! మేగజైన్ కి కథ రాద్దామనుకున్నాను. అది సగంలో ఆగిపోయింది. ముగింపుఎలా చేస్తే బావుంటుందో మిమ్మల్ని అడిగి తెలుసుకుందామని వచ్చాను" చెప్పింది శ్యామల,

"ఓహో! మీరు కథ మొదలెట్టారన్నమాట. ఏమిటిరాశారేంటి?" శ్యామల చేతిలో స్క్రిప్టు అందుకున్నాడు క్రిష్ణ అప్పుడామెచేతి వేళ్ళుతగిలాయి. అక్కడ చదివిచూశాడు. కథలో బిగువులేదు సన్నివేశాలకి పొత్తుకుదరలేదు.

ఇదివ్యాసం కాదు నాల్గు పుస్తకాలు చదివిరాసేముడానికి అని మనసులో అనుకుని పైకి—

"ఇది కథాండి?" అన్నాడు క్రిష్ణ.

"కాధాండీ!" అన్నాది శ్యామల.

"కథ అనేకన్నా వ్యాసం అంటే బావుంటుందండి" మీరు నన్ను ఎగతాళి చేస్తున్నారు.

"నో! నో! మీరెందుకలా భుజాలు తడుముకుంటూన్నారు"

"మరేమిటండీ? కథను పట్టుకుని వ్యాసమంటున్నారు? మీరేదో గొప్ప అనుకుని వచ్చాను. కాస్త సరిచేసి యివ్వండి"

"దీన్ని సరిచేయడం నావల్లకాదండి!" కొంచెం టెక్కు చూపించాడు క్రిష్ణ,

"మీరు అలాగంటే? ఎలాగండీ!. పోనీ మీరే ఏదో కథ రాసి యివ్వగూడదూ" దీనంగా అంది శ్యామల.

"బావుందండోయ్! నాకు వేరేపనేమి లేదనుకున్నారా? మీకు కథలు రాసిపెట్టడం తప్పా? ఆయినా మీకు కథ రాసిస్తే నాకేమి వస్తుంది"

"మీకేమి కావాలి? కో కో కోలా!... గోల్డ్ స్పాటా!..." అంది శ్యామల.

"అవి నాకెందు కండి, రంగు బుడ్లు"

"చెప్తే మీరు కోప్పడ తారండి! అయినా నాకెందుకొచ్చిని బెడద నన్ను వదిలేయండి"

(సశేషం)